# 183 జూనియర్ కాలేజీలు క్లోజ్ ?

- అంపశయ్యపై 101 ప్రభుత్వ, 77 ప్రైవేట్ కాలేజీలు
- అఫిలియేషన్‌కు ఇంకా దరఖాస్తు చేయని వైనం
- ఇక ఇవి మూతపడ్డట్టేనా..? అన్న అనుమానాలు
- గురుకులాల మూసివేతకు కాంగ్రెస్ సర్కారు యత్నం
- సమీకృత గురుకులాల ఏర్పాటుకేనన్న ఆరోపణలు



| యాజమాన్యాలవారీగా కాలేజీలు | | | |
|---|---|---|---|
| యాజమాన్యం | నిరుడు గుర్తింపు పొందినవి | ఈసారి దరఖాస్తుచేసినవి | ఇప్పటికీ చేయనివి |
| బీసీ వెల్ఫేర్ | 261 | 233 | 28 |
| ప్రభుత్వ జూనియర్ కాలేజీలు | 424 | 421 | 03 |
| కేజీబీవీ | 283 | 249 | 34 |
| మాడల్ స్కూల్స్ | 194 | 192 | 02 |
| ఎస్సీ వెల్ఫేర్ | 237 | 233 | 04 |
| మైనార్టీ గురుకులాలు | 204 | 188 | 16 |
| గిరిజన గురుకులాలు | 128 | 114 | 14 |

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ) : రాష్ట్రంలో ఈ ఒక్క ఏడాదే 183 జూనియర్ కాలేజీలు మూతపడబోతున్నాయి. 101 గవర్నమెంట్ మేనేజ్‌మెంట్ కాలేజీలు (గురుకులాలు, కేజీబీవీ) క్లోజ్ అయ్యే జాబితాలో ఉన్నాయి. ఇందులో 62 గురుకులాలే ఉన్నాయి. బీసీ వెల్ఫేర్ 28, మైనార్టీ 16, గిరిజన 14, ఎస్సీ గురుకులాలు 4 ఈ జాబితాలో ఉన్నాయి. అలాగే 77 ప్రైవేట్ జూనియర్ కాలేజీల కథ కూడా పరిసమాప్తంకానున్నది. ఇప్పటి వరకు ఈ కాలేజీలు ఇంటర్ బోర్డు అనుబంధ గుర్తింపు కోసం దరఖాస్తు చేయలేదు. దరఖాస్తు చేయనిదే అనుబంధ గుర్తింపు దక్కదు. ఈ లెక్కన 183 కాలేజీల ముచ్చట ఒడిసినట్టే. ఏటా ఇంటర్‌బోర్డు అనుబంధ గుర్తింపు కోసం అన్ని రకాల కాలేజీలు దరఖాస్తు చేసుకోవాలి. అధికారులు తనిఖీలు చేసి గుర్తింపు ఇస్తారు. ఈ ఏడాది ఇప్పటి వరకు 3,064 కాలేజీలు మాత్రమే దరఖాస్తు చేశాయి. 183 కాలేజీలు అఫిలియేషన్ కోసం దరఖాస్తు సమర్పించలేదు. వీటిలో అత్యధికంగా 101 ప్రభుత్వ, గురుకుల జూనియర్ కాలేజీలే ఉన్నాయి. మూడు ప్రభుత్వ జూనియర్ కాలేజీలు కూడా దరఖాస్తు చేయలేదు. ఒక కో ఆపరేటివ్, ఒక ఇన్సెంటివ్, రెండు ఎయిడెడ్, ఒక రైల్వే/సెంట్రల్‌గవర్నమెంట్ కాలేజీలు, 2 మాడల్ స్కూల్స్, 34 కేజీబీవీలు కూడా దరఖాస్తులు సమర్పించలేదు. దరఖాస్తు చేసుకున్న 700 పైచిలుకు కాలేజీలకు ఇప్పటికే ఇంటర్ బోర్డు గుర్తింపు ఇచ్చింది. జూన్ 2 నుంచి కాలేజీలు ప్రారంభంకానున్నాయి. ఈ నేపథ్యంలో ఈ 101 కాలేజీలు క్లోజ్ అయినట్టేనా? అన్న అనుమానాలొస్తున్నాయి. ఆలస్య రుసుము లేకుండా అఫిలియేషన్ దరఖాస్తుల గడువు ఈ నెల 4తో ముగిసింది. ప్రస్తుతం ఆలస్య రుసుముతో జూన్ 8 వరకు దరఖాస్తు చేసే అవకాశముంది. అంతలోపు దరఖాస్తు చేస్తారా..? అంటే అనుమానంగానే కనిపిస్తున్నది.

### కాంగ్రెస్ హయాంలో 150 ప్రైవేట్ కాలేజీలు క్లోజ్

రేవంత్ సర్కారు కొలువుదీరిన తర్వాత ప్రైవేట్ జూనియర్ కాలేజీలు సైతం గడ్డు పరిస్థితులను ఎదుర్కొంటున్నాయి. ఈ రెండేండ్ల కాలంలో 150 వరకు ప్రైవేట్ జూనియర్ కాలేజీలు మూసివేతకు సిద్ధమయ్యాయి. ఈ ఒక్క ఏడాదే 77 కాలేజీలు క్లోజ్ కానున్నాయి. 2024-25లో 1,415 ప్రైవేట్ కాలేజీలు గుర్తింపు పొందగా, ఈ ఏడాది 1,338 కాలేజీలే దరఖాస్తు సమర్పించాయి. 2023-24లో 1,482 ఉండగా, 2024-25కు వచ్చేసరికి వీటి సంఖ్య 1,415కు పడిపోయాయి. నిరుడు ఒక్క ఏడాదిలోనే 67 కాలేజీలు మూతపడ్డాయి. ఈ ఏడాది 77 కాలేజీలు అఫిలియేషన్‌కు దరఖాస్తు చేయలేదు. సర్కారు స్కాలర్‌షిప్‌లు మంజూరు చేయకపోవడం ఇతరాత్ర కారణాలతో కాలేజీలు మూతపడుతున్నట్టు యాజమాన్యాలు పేర్కొంటున్నాయి.

### కేసీఆర్ పెంచితే.. తుంచేస్తున్న రేవంత్

గత కేసీఆర్ సర్కారు రాష్ట్రంలో పెద్ద ఎత్తున గురుకులాలను ఏర్పాటు చేసింది. 2014లో రాష్ట్రంలో 298 గురుకులాలుండగా, 2023 నాటికి 1,200 పైచిలుకు గురుకులాలను ఏర్పాటు చేసింది. అంటే ఈ పదేండ్ల కాలంలో వెయ్యి వరకు కొత్త గురుకులాలను నెలకొల్పింది. పదో తరగతి వరకు ఉన్న గురుకులాలను ఇంటర్, డిమాండ్‌ను బట్టి డిగ్రీ వరకు అప్‌గ్రేడ్ చేసింది. బీఆర్ఎస్ హయాంలో కార్పొరేట్‌కు దీటుగా ఈ గురుకులాలు నడిచాయి. కాంగ్రెస్ అధికారంలోకి రాగానే ఈ గురుకులాలను గాలికొదిలేసింది. క్రమంగా నిర్వీర్యం చేస్తున్నది. ఫలితంగా గురుకులాల్లో పాముకాట్లు, ఎలుకగాట్లు, ఫుడ్ పాయిజన్లతో పరిస్థితి అస్తవ్యస్థంగా తయారయ్యింది. విద్యార్థులు, తల్లిదండ్రులకు గురుకులాలపై నమ్మకం సడలుతున్నది. ఈక్రమంలోనే గురుకులాలను మూసివేసేందుకు సర్కారు పావులు కదుపుతున్నదన్న వాదనలొస్తున్నాయి. సమీకృత గురుకులాల కోసమే కేసీఆర్ సర్కారు ప్రారంభించిన గురుకులాలను మూసివేస్తున్నదన్న ఆరోపణలొస్తున్నాయి. 105 కొత్త సమీకృత గురుకులాలను దీంట్లో భాగంగానే మంజూరుచేశారన్న వాదనలు వినిపిస్తున్నాయి.

## జెన్‌కో సీఎండీకి వీఏవోఏటీ శుభాకాంక్షలు

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ) : టీజీ జెన్‌కో సీఎండీగా నియమితులైన ఐఏఎస్ అధికారి ఎస్ హరీశ్‌ను విద్యుత్తు అకౌంట్స్ ఆఫీసర్స్ అసోసియేషన్ ఆఫ్ తెలంగాణ(వీఏవోఏటీ) ప్రతినిధులు శుభాకాంక్షలు తెలిపారు. మంగళవారం విద్యుత్తు సౌధలో ఆయన్ను కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి పీ అంజయ్య, ఉపాధ్యక్షుడు నాజర్ షరీఫ్, వీ పరమేశ్, స్వామి, పీ అనిల్, కొరడాల వెంకటేశ్వర్లు, మధుసూదన్, రామారావు, రాజశేఖర్, అపర్ణ తదితరులు సీఎండీని కలిసిన వారిలో ఉన్నారు.

## 3 నుంచి 'పది' సప్లిమెంటరీ పరీక్షలు


హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ) : పదో తరగతి అడ్వాన్స్‌డ్ సప్లిమెంటరీ పరీక్షలు జూన్ 3 నుంచి ప్రారంభంకానున్నాయి. 3 నుంచి 13 వరకు ఉదయం 9:30 గంటల నుంచి మధ్యాహ్నం 12:30 వరకు పరీక్షలు నిర్వహిస్తారు. 42,832 మంది విద్యార్థులు హాజరుకానున్నట్టు ప్రభుత్వ పరీక్షల విభాగం డైరెక్టర్ కృష్ణారావు తెలిపారు. 150 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామని పేర్కొన్నారు. హాల్‌టికెట్లు విడుదల చేశామని, విద్యార్థులు www. bse. telangana.gov.in వెబ్‌సైట్‌ను సంప్రదించి డౌన్‌లోడ్ చేసుకోవచ్చని సూచించారు.

## రేపు 'దోస్త్' సీట్ల కేటాయింపు

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ) : డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాలు కల్పించే డిగ్రీ ఆన్‌లైన్ సర్వీసెస్ తెలంగాణ(దోస్త్) మొదటి విడత సీట్లను గురువారం కేటాయిస్తారు. విద్యార్థులు ఎంచుకున్న ఆప్షన్లను బట్టి కోర్సులవారీగా సీట్లు కేటాయిస్తారు. మొదటి విడతలో ఈ సారి 72,543 మంది దరఖాస్తు చేసుకోగా, 63,613 మంది వెబ్ ఆప్షన్లు ఎంచుకున్నారు.

## హెల్తిట్యూడ్ 2.0 పోస్టర్ ఆవిష్కరణ

హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): అడ్మినిస్ట్రేటివ్ స్టాఫ్ కాలేజ్ ఆఫ్ ఇండియా(ఏఎస్‌సీఐ) సీనియర్ ఫ్యాకల్టీ రూపొందించిన హెల్తిట్యూడ్ 2.0 రిన్యూ, రిచార్జ్, రివైవ్ పోస్టర్‌ను ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ ఆవిష్కరించారు. మంగళవారం హైదరాబాద్‌లోని మంత్రి నివాసంలో జరిగిన ఈ కార్యక్రమంలో డీన్, సెంటర్ డైరెక్టర్ ప్రొఫెసర్ డాక్టర్ సుభోద్ కందముత్తన్, అసిస్టెంట్ ప్రొఫెసర్లు డాక్టర్ ప్రియదర్శిని, డాక్టర్ రేష్మ ఎం గోపన్ పాల్గొన్నారు.



## మేడారంలో అడవి దున్నల సంచారం

ములుగు జిల్లా తాడ్వాయి మండలం మేడారం రహదారిలో మంగళవారం అడవి దున్నలు సంచరించాయి. ఉదయం సమ్మక్క, సారలమ్మల దర్శనానికి వెళ్తున్న భక్తులకు మేడారం సమీపంలోని శివరాం సాగర్ చెరువు సమీపంలోకి రాగానే మూడు దున్నలు రోడ్డు దాటుతూ కనిపించగా ఫొటోలు, వీడియోలు తీసుకుని మురిసిపోయారు. -తాడ్వాయి

## ఆర్‌వీఎంటీ 'కామికేజ్ డ్రోన్'

హైదరాబాద్, మే 27: హైదరాబాద్‌కు చెందిన రఘు వంశీ మెషిన్ టూల్స్(ఆర్‌వీఎంటీ) అత్యాధునిక కామికేజ్ డ్రోన్‌ను అభివృద్ధి చేయనున్నట్టు ప్రకటించింది. 500 కిలోమీటర్ల రేంజ్‌లో ప్రయాణించనున్న ఈ డ్రోన్ ఇటీవల జరిగిన ప్రత్యేక కార్యక్రమంలో ప్రదర్శించింది. శత్రువు డ్రోన్లను కూల్చడానికి వినియోగించనున్న ఈ డ్రోన్లు హైదరాబాద్‌లో తయారుకానుండటం విశేషం.

## మనుగడ కోసం కొందరు రెచ్చగొడుతున్నారు

- వారి మాయలో ఉద్యోగులెవరూ పడొద్దు
- దశలవారీగా సమస్యలను పరిష్కరిస్తాం
- ఎంప్లాయ్ వెల్ఫేర్ బోర్డు సమావేశంలో ఆర్టీసీ ఎండీ వీసీ సజ్జనార్ వెల్లడి



హైదరాబాద్, మే 27 (నమస్తే తెలంగాణ): తెలంగాణ ఆర్టీసీలో కొందరు వ్యక్తులు తమ మనుగడ కోసం ఉద్యోగులను, కార్మికులను రెచ్చగొడుతున్నారని సంస్థ ఎండీ వీసీ సజ్జనార్ ధ్వజమెత్తారు. అలాంటి వ్యక్తుల మాయలో ఉద్యోగులెవ్వరూ పడొద్దని పిలుపునిచ్చారు. హైదరాబాద్ బాగ్‌లింగంపల్లిలోని టీజీఎస్‌ఆర్టీసీ కళాభవన్‌లో మంగళవారం రాష్ట్రస్థాయి ఎంప్లాయ్ వెల్ఫేర్ బోర్డు సభ్యులతో యాజమాన్యం సమావేశమైంది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా హాజరైన సజ్జనార్ మాట్లాడుతూ.. 'మహాలక్ష్మి' పథకం అమలుతో ఆర్టీసీ సిబ్బందిపై పెరిగిన పనిభారాన్ని తగ్గించేందుకు తాత్కాలికంగా డ్రైవర్, కండక్టర్ పోస్టులకు నియామకాలు చేపడుతుండటంతో కొందరు వ్యక్తులు కావాలని తప్పుడు ప్రచారం చేస్తున్నారని మండిపడ్డారు. ఆర్టీసీలో 3,036 రెగ్యులర్ పోస్టుల భర్తీకి ప్రభుత్వం అనుమతి ఇచ్చిందని, సాంకేతిక కారణాల వల్ల నియామక ప్రక్రియలో జాప్యం జరుగుతున్నదని తెలిపారు. ఆ నియమాకాలు కచ్చితంగా జరుగుతాయని, దానిపై ఎలాంటి అనుమానాలు అవసరం లేదని స్పష్టం చేశారు. ఆర్టీసీ ఉద్యోగుల సంక్షేమానికి కట్టుబడి ఉన్నామని, యాజమాన్యం తీసుకునే నిర్ణయాల వెనుక ఉద్యోగులతోపాటు సంస్థ ప్రయోజనాలే ఉంటాయని, ఎవరి వ్యక్తిగత ప్రయోజనాలు ఉండవని తెలిపారు. ఉద్యోగుల పెండింగ్ సమస్యలను దశలవారీగా పరిష్కారిస్తామని హామీ ఇచ్చారు. సమావేశంలో ఆర్టీసీ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్లు మునిశేఖర్, ఖుస్రోషా ఖాన్, సాలోమన్, వెంకన్న, రాజశేఖర్, ఫైనాన్స్ అడ్వైజర్ విజయపుష్పతో పాటు హెచ్‌ఓడీలు పాల్గొన్నారు.



కరీంనగర్ జిల్లా చిగురుమామిడి పోలీసుస్టేషన్‌లో మాజీ సర్పంచ్‌లు

## మాజీ సర్పంచ్‌ల ముందస్తు అరెస్ట్‌లు

- 'చలో హైదరాబాద్'కు వెళ్లకుండా కట్టడి
- ఎక్కడికక్కడ అడ్డుకున్న పోలీసులు
- తెల్లవారుజామునే ముందస్తు అరెస్ట్‌లు
- పెండింగ్ బిల్లులు అడగడమూ నేరమేనా?
- సర్కార్ తీరుపై మాజీ సర్పంచ్‌ల ఆగ్రహం

నమస్తే నెట్‌వర్క్, మే 27: రాజ్యాంగ బద్ధంగా రావాల్సిన నిధులు, హక్కుల కోసం ప్రభుత్వానికి వినతిపత్రం అందించేందుకు మంగళవారం చేపట్టిన 'చలో హైదరాబాద్' కార్యక్రమాన్ని పోలీసులు అడ్డుకున్నారు. హైదరాబాద్ వెళ్లకుండా జిల్లాల్లో ఎక్కడికక్కడ మాజీ సర్పంచ్‌లను కట్టడిచేశారు. తెల్లవారుజామునే ఇండ్లకు వెళ్లి అదుపులోకి తీసుకున్నారు. పోలీసుల నిర్బంధంపై మాజీ సర్పంచ్‌లు ఆగ్రహం వ్యక్తంచేస్తున్నారు. తమకు రావాల్సిన బిల్లులను అడగడం కూడా నేరమేనా? అని ప్రశ్నిస్తున్నారు. హైదరాబాద్‌కు వెళ్లేందుకు సిద్ధమైన మాజీ సర్పంచ్‌లను ఉమ్మడి కరీంనగర్ జిల్లా వ్యాప్తంగా పోలీసులు నిర్బంధించారు. మంగళవారం తెల్లవారుజామున వారి ఇండ్లకు వెళ్లి అరెస్టు చేసి, ఆయా పోలీస్ స్టేషన్లకు తరలించారు. అనంతరం సొంత పూచీకత్తుపై విడుదల చేశారు. ఉమ్మడి వరంగల్ జిల్లాలో మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తు అరెస్ట్ చేశారు. అత్యుత్సాహం ప్రదర్శించి మాజీ సర్పంచ్‌ల భర్తలు, కుమారులను కూడా అదుపులోకి తీసుకున్నారు. నిర్మల్ జిల్లాలోని మాజీ సర్పంచ్‌లు, ప్రజాప్రతినిధులు మంగళవారం ఉదయం హైదరాబాద్ వెళ్లేందుకు సిద్ధం కాగా.. సోమవారం అర్ధరాత్రి నుంచే మాజీ సర్పంచ్‌లను పోలీసులు ముందస్తుగా అదుపులోకి తీసుకున్నారు. ఖానాపూర్, కడెం, లక్ష్మణచాంద మండలాల్లో మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి పోలీసు స్టేషన్లలో నిర్బంధించారు. ఉమ్మడి మహబూబ్‌నగర్ జిల్లాలోని జడ్చర్ల, అలంపూర్ మండలం ఊట్కూరు, సుల్తానాపురం, అయిజ మండలం గుడుదొడ్డి, మేడికొండ, చిన్న చింతకుంట, వెల్దండ మండలాలకు చెందిన మాజీ సర్పంచ్‌లను పోలీసులు అదుపులోకి తీసుకొన్నారు. మాజీ సర్పంచ్‌లను అరెస్టు చేసి రంగారెడ్డి జిల్లా ఇబ్రహీంపట్నం పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఈ సందర్భంగా సర్పంచుల సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, మాజీ సర్పంచ్ రాయపోల్ గంగిరెడ్డి బల్వంత్‌రెడ్డి, మాజీ సర్పంచ్ తులేకలాన్ సర్పంచ్ యాదగిరి మాట్లాడుతూ.. పెండింగ్ బిల్లులు చెల్లించాలని ప్రభుత్వాన్ని ప్రశ్నిస్తే, అక్రమ అరెస్టులు, గృహనిర్బంధాలు చేయడం హేయమైన చర్యగా పేర్కొన్నారు.

## నిర్బంధాల నీడన కాంగ్రెస్ సర్కార్ పాలన

- సీతక్క పర్యటనలో ముందస్తు అరెస్టు
- భగ్గుమన్న బీఆర్ఎస్ నాయకులు
- ఇంత నిర్బంధం ఎందుకని ప్రశ్న

నిర్మల్, మే 27 (నమస్తే తెలంగాణ) : కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన ఏడాదిన్నర నుంచి ఆంక్షల పాలన కొనసాగుతున్నదని బీఆర్ఎస్ నాయకులు విమర్శించారు. సర్కార్ కార్యక్రమాలు నిర్బంధాల నీడనే అమలవుతున్నాయని మండిపడ్డారు. మంగళవారం ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క పర్యటన ఆంక్షల మధ్యే కొనసాగింది. సోమవారం రాత్రి నుంచే నిర్మల్, ముథోల్ నియోజకవర్గాల్లో బీఆర్ఎస్ నాయకులు, సీనియర్ కార్యకర్తలను పోలీసులు గృహనిర్బంధం చేశారు. మరికొంత మందిని ముందస్తు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్లకు తరలించారు. ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్తలు విలాస్, రమాదేవితోపాటు పలువురు నాయకులను పోలీసులు హౌస్ అరెస్టు చేశారు. సమీపంలోని పోలీస్ స్టేషన్‌కు కూడా తరలించారు. మంత్రి కార్యక్రమాలు జరిగిన లోకేశ్వరం, బ్రహ్మాన్‌గావ్‌ల్లోనూ పోలీసు బలగాలను భారీగా మోహరించి బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు రాకుండా అడ్డుకున్నారు. పోలీసుల తీరుపై బీఆర్ఎస్ నాయకులు మండిపడ్డారు.



నిర్మల్ జిల్లా ముథోల్ నియోజకవర్గ బీఆర్ఎస్ సమన్వయకర్త రమాదేవిని హౌస్ అరెస్టు చేసిన పోలీసులు





